సాక్షి
బాపట్ల
బుధవారం । 16 । ఆగస్టు । 2023



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 518.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు వదిలారు.



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం
విజయవాడ: ఇంద్రకీలాద్రిపై నిత్యాన్నదానానికి తాడేపల్లికి చెందిన భక్తులు గుడివాక జయదేవ్ సూర్య, జయసూర్య ఆర్యన్ మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.



నిమ్మకాయల ధరలు
తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2,200, గరిష్ట ధర రూ.3,700, మోడల్ ధర రూ.2,700 వరకు పలికింది.

న్యూస్‌రీల్

నేడు ఎంపీ విజయసాయిరెడ్డి రాక
సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా రీజినల్ కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డి బుధవారం బాపట్ల రానున్నారు. రెండు రోజులపాటు ఇక్కడ ఉంటారు. పట్టణంలోని కోన భవన్‌లో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన శాసన సభ్యులు, ఇన్‌చార్జిలతోపాటు ఎంపీలు, మాజీ ఎమ్మెల్యే, ముఖ్య నేతలతో సమావేశం అవుతారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారు. భవిష్యత్ కార్యాచరణపై నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు.

అందరికీ సంక్షేమ ఫలాలు
బాపట్ల కలెక్టర్ రంజిత్ బాషా



బాపట్ల: సంక్షేమ ఫలాలను ప్రజలందరికీ చేరవేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులపై ఉందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌పై జాతీయ జెండాను మంగళవారం ఎగురవేశారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పుష్ప మాలలతో నివాళులర్పించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన తదుపరి అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జేసీ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లాలో తేనీటి విందు



చీరాల అర్బన్: స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా చీరాలలోని కలెక్టర్ బంగ్లాలో మంగళవారం రాత్రి కలెక్టర్ రంజిత్ బాషా తేనీటి విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి చీరాల, బాపట్ల ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, కోన రఘుపతి, రాష్ట్ర మార్కెటింగ్, సహకార శాఖ రాష్ట్ర సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్ హాజరయ్యారు. జిల్లాలోని వివిధ హోదాలలో ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్‌లో స్వాతంత్య్రోత్సాహం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): మహానుభావుల త్యాగఫలితమే స్వాతంత్య్రమని గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు చెప్పారు. మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు రేంజ్ క్యాంపు కార్యాలయంలో ఐజీ పాలరాజు జాతీయ జెండాను ఎగురవేశారు. ఐజీ మాట్లాడుతూ త్యాగధనుల పోరాట స్ఫూర్తిని కొనియాడారు. ప్రజాసేవకు పోలీసులు పునరంకితం కావాలని సూచించారు. ఏఎస్పీ (ఏఆర్) కోటేశ్వరరావు, డీఎస్పీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో..
గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంతో పాటు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ జెండా ఎగురవేశారు. ఏఎస్పీలు కె.కోటేశ్వరరావు (ఏఆర్), డి.ఎస్. మహేష్ (ఎస్ఈబీ) పాల్గొన్నారు.

వీరాంజనేయుడికి వెండి కిరీటం సమర్పణ
పాముర్రు: స్థానిక ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలోని స్వామికి దాతలు మంగళవారం వెండి కిరీటాన్ని సమర్పించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎల్.సత్యవతి తెలిపారు. గుడివాడకు చెందిన బోయిన వీరరాఘవయ్య దంపతులు రూ.1.35 లక్షలు వెచ్చించి 1.546 కిలోల వెండితో వీరాంజనేయస్వామికి కిరీటాన్ని తయారు చేయించి, ఆలయ కమిటీ చైర్మన్ మట్టా పూర్ణచంద్రరావు, ధర్మకర్తల మండలి సభ్యుడు డి.డి.ప్రసాద్‌కు అందజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రామాచార్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పతాక

స్వాతంత్య్ర సంబరాలు అంబరాన్నంటాయి.. వీరులే యుద్ధానికి వెళ్తారు.. వీరులే మెరుపులై మెరుస్తారు.. వీరులే అమరులై వస్తారంటూ దేశ రక్షణలో యువత త్యాగాలను స్మరించారు.. జాతీయ పతాక విశిష్టత చాటారు.. త్యాగధనుల పోరాటాలను గుండెల్లో నింపుకుని బాపట్ల పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల ప్రదర్శనలతో మువ్వన్నెల జెండా డెబ్బై ఏడు వసంతాల వేళ రెపరెపలాడింది.. పోలీస్ కవాతు ఆకట్టుకుంది. సంక్షేమ శకటాల ప్రదర్శన ప్రభుత్వ చిత్తశుద్ధిని చాటింది. ప్రజాప్రతినిధులు, అధికారులు జిల్లా సమగ్రాభివృద్ధికి బాటలు వేసేలా ప్రణాళిక ప్రకటించారు.



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



స్వాతంత్య్ర వేడుకల్లో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ, వేదికపై కలెక్టర్ రంజిత్‌బాషా, ఎంపీ మోపిదేవి, ఎమ్మెల్యే రఘుపతి తదితరులు

జిల్లా సమగ్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి
- 47,501 మంది పేదలకు పక్కా గృహాలు
- జిల్లాలో 6,71,941 ఎకరాలకు సాగునీరు
- రూ.9.61 కోట్లతో ఉద్యాన పంటల సాగు
- మత్స్యకారులకు రూ.21.726 కోట్ల సాయం
- స్వాతంత్య్ర వేడుకల్లో ఇన్‌చార్జి మంత్రి కొట్టు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: బాపట్ల జిల్లా సమగ్రాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో 77వ స్వాతంత్య్ర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను ఎగురవేసి, వందన సమర్పణ చేశారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తున్న అధికార యంత్రాంగాన్ని మంత్రి అభినందించారు.

జగనన్న సురక్షతో మేలు
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ జగనన్న సురక్ష కింద జిల్లాలో 4,76,819 మందికి వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించినట్లు వెల్లడించారు. లక్ష్యం సాధనలో వలంటీర్లు, ప్రజాప్రతినిధులు కృషి ఎనలేనిదని చెప్పారు.

పేదలకు 47,501 ఇళ్లు..
జిల్లాలో పేదలకు 47,501 పక్కా గృహాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అందుకు గాను రూ.855 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. వీటి ద్వారా 289 ఊళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇక్కడ తాగునీటి సౌకర్యం కోసం రూ.12.21 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర మౌలిక సదుపాయాల కోసం 264 పనులు చేపట్టి, రూ.27.49 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

రైతన్నకు అడుగడుగునా అండ..
ప్రభుత్వం వ్యవసాయ రంగానికి తగిన ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. రైతన్నకు అన్ని విధాలా అండగా ఉంటున్నట్లు పేర్కొన్నారు. ఖరీఫ్‌కు అవసరమైన 6,933 క్వింటాళ్ల విత్తనాలు రాయితీపై అందించినట్లు తెలిపారు. వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా రూ.4.17 కోట్ల రాయితీతో 143 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లకు నూరు ట్రాక్టర్లు, వివిధ రకాల యంత్ర పరికరాలు అందించినట్లు వెల్లడించారు. 51,104 టన్నుల వివిధ రకాల ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో గత ఏడాది రైతుల వద్ద నుంచి 1.17 లక్షల టన్నుల వరి ధాన్యం సేకరించి రూ.241 కోట్లు చెల్లించినట్లు చెప్పారు.

రైతుకు బీమా– ధీమా
వైఎస్సార్ రైతు భరోసా– పీఎం కిసాన్ పథకం ద్వారా 1,82,854 రైతు కుటుంబాలకు రూ.372 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా ద్వారా 45,072 మంది రైతులకు రూ.110.77 కోట్లు బీమా పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటల అభివృద్ధి కోసం రూ.9.61 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. 21,726 మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతి ద్వారా రూ.21.726 కోట్లు అందించినట్లు చెప్పారు. పశుగ్రాస భద్రత కింద 156 టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణా రాయితీపై ఇచ్చామన్నారు. జిల్లాలో అన్ని సాగునీటి పథకాలద్వారా 6,71,941 ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా 3,40,143 మంది రైతులకు ఏడాదికి రూ.2,200 కోట్లు రుణాలు అందిస్తున్నామని ప్రకటించారు.

అమ్మ ఒడితో..
విద్యాశాఖ పరిధిలో అమ్మ ఒడి పథకం కింద 2022–23 ఏడాదికి గాను రూ.177 కోట్లు తల్లుల ఖాతాలో జమ చేసినట్లు వివరించారు. దీనితో పాటు జగనన్న విద్యా కానుక కింద రూ.25 కోట్లు విలువ సామగ్రిని చిన్నారులకు అందించడం ద్వారా విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యాన్ని వెల్లడించినట్లు చెప్పారు.

'గ్రీన్ బాపట్ల'తో..
జిల్లాలో 'గ్రీన్ బాపట్ల' కార్యక్రమం ద్వారా రెండు లక్షలకు పైగా మొక్కలు నాటినట్లు మంత్రి కొట్టు వివరించారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2,82,000 మందికి పనులు కల్పించగా రూ.200 కోట్ల నిధులు ఖర్చు చేసి మెరుగైన ర్యాంక్ సాధించినట్లు చెప్పారు.

మహిళలకు భరోసా..
జిల్లాలో 126 గ్రామ సంఘాలకు రూ.3.42 కోట్లు, బ్యాంకు లింకేజీ ద్వారా 1700 గ్రూపులకు రూ.206 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు మంత్రి చెప్పారు. వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా 2,24,565 మందికి రూ.247 కోట్లు అందించినట్లు వివరించారు. వైఎస్సార్ బీమా పథకం కింద 459 మందికి రూ.7.79 కోట్లు ఇచ్చామన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.238 కోట్లు, సున్నా వడ్డీ పథకం ద్వారా రూ.43 కోట్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

చేనేత కార్మికులకు వరం..
8705 చేనేత కార్మిక కుటుంబాలకు రూ.20 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రతినెల 32 టన్నుల ఫోర్టిఫైడ్ బియ్యంతో పాటు పలు రకాల సరుకులు అందిస్తున్నామన్నారు. పలు ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన పేదలకు లబ్ధి చేకూరుస్తున్నట్లు మంత్రి చెప్పారు.

వీరుల కుటుంబాలకు సన్మానం



స్వాతంత్య్ర వేడుకలకు హాజరైన సైనిక అమరుల కుటుంబాలను సన్మానించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్, జేసీ సి.శ్రీధర్, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

కలల సాకారానికి పీఎం యశస్వి

- 9,10 ఇంటర్ విద్యార్థులకు ఉపకార వేతనాలు
- దరఖాస్తుకు రేపటి వరకు గడువు
- వచ్చేనెల 29న అర్హత పరీక్ష



పాఠశాల విద్యార్థులు

బాపట్ల అర్బన్: ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనకబడిన విద్యార్థుల చదువులకు సాయం అందించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రేంట్ ఇండియా(పీఎం యశస్వి) పథకం అమలు చేస్తుంది. ఆర్థిక కారణాలతో మధ్యలోనే చదువు ఆపి ఉపాధి బాట పట్టే విద్యార్థులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇతర వెనకబడిన కులాలు(ఓబీసీ) ఆర్థికంగా వెనుకబడిన కులాలు(ఈబీసీ), నో మాడిక్ (సంచార), సెమినో మాడిక్ వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే అవకాశం ఉంది. పీఎం యశస్వి కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం గత ఏడాది రూపకల్పన చేసింది. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ సాధికారిక మంత్రి శాఖ పరిధిలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ పథకాన్ని నిర్వహిస్తుంది. 9, 10, తరగతుల విద్యార్థులకు ఏడాదికి రూ.75,000, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారికి ఏడాదికి రూ.1.25 లక్షల మేరకు ఉపకార వేతనం ఒకేసారి ఇస్తారు. ఎంపికైన విద్యార్థి ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతాలకు ఈ మొత్తాన్ని నేరుగా జమ చేస్తారు. దేశంలోని కేంద్రపాలిత ప్రాంతాలు సహా ప్రతి రాష్ట్రం నుంచి పరిమిత సంఖ్యలో ఈ పథకానికి ఎంపిక చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది దీని ప్రకారం మన రాష్ట్రంలో ఈ ఏడాది ఈ స్కాలర్‌షిప్‌కు 1,401 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

రేపటి వరకు గడువు
దరఖాస్తు గడువు గత గురువారం ముగియగా ఈనెల 17వ తేదీ వరకు గడువు పొడిగించారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చేనెల 29న స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో అర్హత పొందిన విద్యార్థులు ఉపకార వేతనానికి అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏ బ్యాంకు ద్వారా పొందాలను కుంటారో దాని పాస్‌బుక్ ఫొటో కాపీని జత చేయాలి. దరఖాసుదారులు ఒక నయా పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. పూర్తి ఉచితంగానే దరఖాస్తు చేసుకొని పరీక్ష రాయవచ్చు.

ఇవి అర్హతలు
- విద్యార్థి భారతీయుడై ఉండాలి.
- కేంద్ర విద్యా శాఖ అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్ నిర్వహించే యశస్వి ఆన్లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి.
- ప్రవేశ పరీక్షకు 8వ తరగతి పూర్తి చేసి ఉండాలి.
- 9,10 తరగతులు పూర్తయిన వారు కూడా ఇంటర్ వరకు ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలు మించి ఉండకూడదు.

పరీక్షా విధానం ఇలా..
- మూడు గంటల పాటు పరీక్ష ఉంటుంది.
- హిందీ, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహిస్తారు
- మల్టీపుల్ ఛాయిస్ విధానంలో ఓఎంఆర్ షీట్లపై పరీక్ష రాయాల్సి ఉంటుంది.

దరఖాస్తు చేసుకోవడం ఇలా
- ఈ స్కాలర్‌షిప్ పొందేందుకు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి.
- ప్రవేశ పరీక్ష రాసే ముందు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి.
- పేరు, ఈమెయిల్ అడ్రస్ పుట్టిన తేదీ పాస్‌వార్డు తదితర వివరాలతో లాగిన్ ఐడి క్రియేట్ చేసుకోవాలి.
- అనంతరం దరఖాస్తుదారుడుకు అప్లికేషన్ నంబర్ వస్తుంది, అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబర్ పాస్‌వార్డుతో లాగిన్ కావాలి.
- చదువు గుర్తింపు కార్డు తదితర వివరాలు డాక్యుమెంట్లు సాఫ్ట్ కాపీలను అప్లోడ్ చేసి సైన్ ఆఫ్ చేయాలి.
- దరఖాస్తు ఫారం పూర్తి చేసిన తర్వాత దాని కాపీ ప్రింట్ తీసుకొని దగ్గర ఉంచుకోవాలి.
- పరీక్ష ప్రవేశ కార్డు జారీ చేసే తేదీ తదితర వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చు.

స్కూలు బస్సు బోల్తా

20 మంది విద్యార్థులకు స్వల్పగాయాలు



కూచిపూడి - పెదపూడి మార్గంలో పడి పోయిన విద్యార్థుల స్కూలు బస్సు

వేమూరు: ప్రైవేటు స్కూలు బస్సు అదుపు తప్పి కాలువలో పడింది. ఇరవై మంది విద్యార్థులకు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన కూచిపూడి–పెదపూడి మధ్య చోటుచేసుకుంది. వివరాలు.. కూచిపూడి గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు 77వ స్వాతంత్య్ర వేడుకల అనంతరం విద్యార్థులను ఇళ్లకు పంపించేందుకు బయలుదేరింది. బస్సులో పెదపూడి, పెరవలిపాలెం, పెరవలి, చావలి గ్రామాలకు చెందిన 50 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు పెదపూడి వైపు వెళ్తుండగా బస్సు డ్రైవర్ అతివేగంగా నడుపుతూ అదే స్కూలుకు చెందిన మరో బస్సును ఓవర్ టేకే చేసే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బస్సులోని విద్యార్థుల్లో 20 మందికి స్వల్పంగా గాయపడ్డారు. వీరిని తెనాలిలోని ప్రైవేటు హాస్పటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనా స్థలాన్ని అమృతలూరు ఎస్ఐ సురేష్ పరిశీలించారు. రేపల్లె ఆర్డీఓ ఆర్.పార్థసారథి, అమృతలూరు తహసీల్దార్ మహ్మద్ సుభానీ, ఎంఈఓ కనపాల రమేష్, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. బస్సు డ్రైవరుపై కేసు నమోదు చేశారు.

ఏం పాపం చేశానమ్మా..

- మృతశిశువును వదిలేసిన మహిళ
- ఏరియా వైద్యశాలలో వెలుగు చూసిన ఘటన



మరుగుదొడ్డిలో పడి ఉన్న మగశిశువు మృతదేహం

బాపట్ల: 'నవమాసాలు మోసిన కన్నపేగుకు ఎందుకొచ్చిందమ్మా అంత కాఠిన్యం.. మూడో నెలలో కడుపున పడ్డానని మురిసినపోయిన జ్ఞాపకం నాకు గుర్తుందమ్మా..ఆరో నెలలో నా కదలికలకు ఉప్పొంగిన నీ గుండెల్లో సంబరం ఎలా మరిచిపోతానమ్మా.. తొమ్మిదో నెలలో శూలం వేసి పొడుస్తున్నట్లు పురిటి నొప్పులొచ్చినా భరించిన నీవు.. నన్ను చూసి రాల్చిన ఆనందబాష్పాల తడి నా శరీరంపై ఇంకా అలానే ఉందమ్మా.. నీ ఊపిరితో భూమిపైకి వస్తే.. కనుగుడ్లు కూడా తెరవకముందే కానరాని లోకాలకు పంపించావా.. అయినా నీ మీద నాకు కోపం లేదమ్మా.. ఎందుకంటే నీవు మా అమ్మవు..' బాపట్లలో అప్పుడే పుట్టిన మగశిశువును ఓ తల్లి మరుగుదొడ్డిలో పడేసింది. డీఎస్పీ టి.వెంకటేశులు అందించిన వివరాలు.. బాపట్లలోని ఏరియా వైద్యశాలకు సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో 20 నుంచి 22 సంవత్సరాల గర్భిణి హాస్పిటల్‌కు వచ్చింది. అక్కడ ఉన్న కాంపౌండర్‌ను కడుపులో నొప్పిగా ఉంది మరుగుదొడ్డి ఎక్కడ అని అడిగింది. మరుగుదొడ్డి చూపించి కాంపౌండర్ వెళ్లిపోయాడు. తరువాత ఆమె తిరిగి హాస్పిటల్‌లోకి రాకుండా బయటకు వెళ్లిపోయింది. మంగళవారం ఉదయం మరుగుదొడ్డి శుభ్రం చేసేందుకు సిబ్బంది వెళ్లి చూడగా చనిపోయిన మగశిశువును గమనించి వైద్యులకు సమాచారం ఇచ్చారు. వైద్యుల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ టి.వెంకటేశులు తెలిపారు.

రూ.2 లక్షల విలువైన తెలంగాణ మద్యం స్వాధీనం

పాతనేరస్తుడి అరెస్ట్



మాట్లాడుతున్న ఏఎస్పీ మహేష్, పక్కన సీఐలు కర్ణ, అంటోనిరాజు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): తెలంగాణకు చెందిన మద్యం సీసాలు తీసుకొచ్చి, విక్రయించే పాత నేరస్తుడిని ఎస్ఈబీ (సెబ్) గుంటూరు–2 పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద రూ.2 లక్షలు ఖరీదు చేసే ఫుల్, క్వార్టర్ బాటిళ్లు, ఆటో సీజ్ చేశారు. ఇన్నర్‌రింగ్ రోడ్‌లోని గుంటూరు–2 ఎస్ఈబీ(సెబ్) స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సెబ్ గుంటూరు ఏఎస్పీ డి.ఎస్. మహేష్ కేసు వివరాలను వెల్లడించారు. ఏఎస్పీ కథనం ప్రకారం.. ముందస్తు సమాచారంతో మేడికొండూరు మండలం పేరేచర్ల జంక్షన్ వద్ద మంగళవారం మకాం వేసి, వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గుంటూరు నగరంలోకి వస్తున్న ఆటోను ఆపి సోదాలు చేశారు. ఆటోలో వెనుక ఉన్న సీటు కింద తెలంగాణ మద్యం సీసాలను గుర్తించారు. నల్లచెరువు ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ఇంతియాజ్ ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ప్రయాణికుల ఆటో సీటు అడుగున సీసాల నిల్వకు అనువుగా అలమరలాంటిది తయారు చేయించినట్టు తెలుసుకుని పోలీసులు విస్తుపోయారు. ఇంతియాజ్‌ను అరెస్ట్ చేసి, రూ.2 లక్షలు ఖరీదు చేసే 60 ఫుల్ బాటిళ్లు, 47 క్వార్టర్ సీసాలను సీజ్ చేశారు. ఇంతియాజ్‌పై గతంలో లాలాపేట పీఎస్, గుంటూరు–1, నరసరావుపేట ఎస్ఈబీ స్టేషన్లలోనూ కేసులు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల మద్యం సీసాలను ఇక్కడకి తీసుకొచ్చి, విక్రయించడం చట్టరీత్యా నేరమని ఏఎస్పీ చెప్పారు. అక్రమాలపై ప్రజలెవరైనా ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం ఇవ్వవచ్చని సూచించారు. సమావేశంలో గుంటూరు– 2 ఎస్ఈబీ స్టేషన్ సీఐ కె.కర్ణ, ఎస్ఐలు ఇ.కల్యాణ చక్రవర్తి, ఎస్.హర్షవర్ధన్‌రెడ్డి, డీఎస్ఈఓ సీఐ సామినేని అంటోనిరాజు, హెచ్‌సీలు పోతురాజు, కె.ప్రేమ్‌కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మహిళతో అసభ్య ప్రవర్తన



ముసామీన్

ప్రత్తిపాడు: ఆర్టీసీ బస్సులో ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ కథనం.. మండలంలోని పాతమల్లాయపాలెం ఎస్సీ కాలనీకి చెందిన మహిళ మంగళవారం రాత్రి గుంటూరు నుంచి ప్రత్తిపాడు బస్సులో వస్తున్నారు. అదే బస్సులో చేబ్రోలు మండలం వేజెండ్లకు చెందిన షేక్ ముసామీన్ కూడా ఎక్కాడు. ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. మహిళ, తోటి ప్రయాణికులు కూడా మహిళకు మద్దతుగా నిలిచారు. ముసామీన్ ప్రయాణికులపైనా అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో మహిళ విషయాన్ని ఫోన్ ద్వారా తన బంధువులకు తెలియజేసింది. ఆ వ్యక్తికి దేహశుద్ధి చేశారు. అనంతరం ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి అప్పగించారు. కేసు నమోదు చేయనున్నట్లు ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు తెలిపారు.

గరువుపాలెంలో వ్యాపారి ఇంట్లో చోరీ

రూ.పది లక్షల విలువైన బంగారం, నగదు అపహరణ

చేబ్రోలు: దైవ దర్శనంగా కోసం వెళ్లిన కొబ్బరి బోండాల వ్యాపారి ఇంటిలో దొంగలు చోరీకి తెగబడ్డారు. మండలంలో వడ్లమూడి గరువుపాలెంలో జరిగిన ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. వడ్లమూడి గ్రామ పరిధిలోని గరువుపాలెం ప్రాంతానికి చెందిన కొబ్బరిబొండాల వ్యాపారి ఉయ్యూరు వెంకటేశ్వరరావు రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులందరితో కలిసి శ్రీశైలం వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చిన వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు, కిటికీలు విరగగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి చూశారు. రెండు బీరువాలలోని రూ.2.10లక్షలు, 14 సవర్ల బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించింది.

ప్రతిభా పురస్కారాలు

స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రగతిలో భాగస్వాములైన ఉద్యోగులకు, ఉత్తమ సేవా అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. -బాపట్ల, బాపట్ల టౌన్


స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి కొట్టు సత్యనారాయణ నుంచి ఉత్తమ సేవ అవార్డు అందుకుంటున్న జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివజ్యోతి


ఎస్.విజయమ్మ, డీఎంహెచ్ఓ | గంధం రవీందర్, ఆర్డీఓ, బాపట్ల | ఈజీ విలియమ్స్, డీఎస్ఓ | దాసరి రాంబాబు, డీపీఓ | మదనమోహన్‌శెట్టి, పరిశ్రమలశాఖ అధికారి | అబ్దుల్‌సత్తార్, వ్యవసాయశాఖాధికారి | రాజ్‌దిబోరా, సోషల్‌వెల్ఫేర్ డీడీ | ఏ భానుప్రతాప్, మున్సిపల్ కమిషనర్


చంద్ర సువార్త, డీఎల్‌పీఓ | అర్జునరావు, డీఆర్‌డీఏ పీడీ


శివ గణేష్‌న్, గ్రంథాలయశాఖ కార్యదర్శి | విజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం | చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖాధికారి | వి.శ్రీలక్ష్మి, జిల్లా సివిల్‌సప్లై డీఎం | సరోజినీ చీరాల ఆర్డీఓ | జెన్నెమ్మ, ఉద్యాన శాఖ జేడీఏ | పార్థసారథి, రేపల్లె ఆర్డీఓ | కామేశ్వరి, జిల్లా ట్రెజరీ ఆఫీసర్ | ఆర్.గుణశీల, జిల్లా సైనికాధికారిణి | బి.శ్రీనివాసులు, అద్దంకి మున్సిపల్ కమిషనర్


మంత్రి కొట్టు సత్యనారాయణ నుంచి అవార్డు అందుకుంటున్న జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్

అవార్డులు అందుకున్న పోలీస్ అధికారులు


వెంకటేశ్వర్లు, వీఆర్ ఎస్‌ఐ | ఎ.శ్రీనివాస్, ఎస్‌బి సీఐ | సీజే భరత్, ఐటీ కోర్ ఆర్ఎస్‌ఐ | ఎల్. వీరానాయక్, సీసీఎస్ సీఐ | సీఐ మురళీకృష్ణ, డీసీఆర్‌బీ | వెంకటేశ్వర్లు, వేమూరు సీఐ


ఎ.మల్లికార్జున, చీరాల రూరల్ సీఐ | ప్రసాద్, పర్చూరు ఎస్‌ఐ | ఎస్‌ఐ కమలాకర్, మార్టూరు | వేణుగోపాలరెడ్డి, బాపట్ల రూరల్ సీఐ | కృష్ణయ్య, బాపట్ల పట్టణ సీఐ


విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ

వీఆర్వో శేఖర్‌కు ఉత్తమ సేవా పతకం


సచివాలయాల డైరెక్టర్ లక్ష్మయ్య నుంచి ఉత్తమ సేవా అవార్డు తీసుకుంటున్న వాడరేవు రెవెన్యూ అధికారి శేఖర్

చీరాల టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో చీరాల మండలం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు గ్రామ రెవెన్యూ అధికారులకు ఉత్తమ సేవా అవార్డులకు ఎంపిక చేసింది. మంగళవారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో సేవా పురస్కారాల పంపిణీలో ఉత్తమ సేవా అవార్డులకు ఎంపికైన వాడరేవు వీఆర్‌ఓ(ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్) సీహెచ్ శేఖర్, తోటవారిపాలెం వీఆర్‌ఓ డి.సాల్మన్‌లకు గ్రామ సచివాలయాల డైరెక్టర్ జి.లక్ష్మయ్య చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. రెవెన్యూశాఖలో ఉత్తమ సేవ అవార్డులు సాధించిన శేఖర్, సాల్మన్‌లను తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, డీటీ సురేష్‌కుమార్, వీఆర్వోలు, కార్యాలయం ఉద్యోగులు అభినందించారు.

ప్రమాదవశాత్తూ జింక మృతి


మృతిచెందిన జింకను పరిశీలిస్తున్న అధికారులు

మార్టూరు: కొండల మధ్య నుంచి జనారణ్యంలో పొరపాటున ప్రవేశించి ప్రమాదవశాత్తూ జింక మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని తాటివారిపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ తెలిపిన వివరాలు.. బొల్లాపల్లి, కోలలపూడి గ్రామాల కొండల మధ్య నుంచి ఓ జింక పొరపాటున తాటివారిపాలెం గ్రామంలోకి ప్రవేశించింది. గ్రామస్తులను చూసి భయంతో పరుగెత్తిన జింక కాసా వీరాంజనేయులుకు చెందిన పశువుల పాకలో చేరింది. కంగారుతో తాటి దూలాన్ని బలంగా ఢీ కొట్టింది. అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్తుల సమాచారంతో ఘటనా స్థలాన్నిఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రమేష్, జాన్సన్ పరిశీలించారు. కోలలపూడి పశువైద్యాధికారి మాధవీలత ద్వారా జింక మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల సహకారంతో కొండ ప్రాంతంలో జింక మృత దేహాన్ని దహనం చేయించారు.

ఆపదలో అండగా దిశ

అబ్బుర పరిచిన యాప్ డెమో


దిశ యాప్ వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: ఆపదలో మహిళలకు ఆపద్బాంధవుడు దిశ యాప్ అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దిశ యాప్ డెమో ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. తొలుత పోలీసుల ఆధ్వర్యంలో పెరేడ్ కమాండర్ ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్ కుమార్ మంత్రికి గౌరవ వందనం సమర్పించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై మంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ పోలీస్ కవాతు పరిశీలన వేదిక వద్దకు చేరుకున్నారు. జిల్లాలోని స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబ సభ్యలను ఘనంగా సత్కరించారు. అనంతరం గౌరవ వందనం సమర్పించారు.

పోలీస్ అధికారులకు అవార్డులు

పోలీస్ శాఖలో చేసిన సేవలకు గుర్తుగా 12 మంది జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పతకాలను మంగళవారం మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అందులో జిల్లా ఎస్‌బీ సీఐ ఏ శ్రీనివాస్ పోలీస్ శాఖకు చేసిన సేవలకు గుర్తుగా మహోన్నత సేవా పతకం, ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వర్లుకు పోలీస్ యాంత్రిక్ సేవ పతకం, చీరాల టౌన్ ఏఎస్‌ఐ కె.సిలువరాజు(డీజీపీ కమాండేషన్- 2020), మార్టూరు ఏఎస్‌ఐ షేక్ సైదా (సేవా పతాకం ఉగాది- 2023), అద్దంకి ఏఎస్‌ఐ ఎల్.వి.సుదీర్(ఉగాది సేవాపథకం- 2023), డీసీఆర్‌బీ ఈఏఎస్‌ఐ పి.ప్రమీలా దేవి(ఏపీ ఫార్మేషన్ డే సేవా పతకం- 2022), డీఏఆర్ ఏఆర్‌హెచ్‌సీ యు.వెంకటేశ్వర్లు (ఏపీ ఫార్మేషన్ డే సేవా పతకం 2022), ఇంకొల్లు హెచ్‌సీ జి.పూర్ణచంద్రరావు(డీజీపీ కామాండేషన్), చీరాల- 2 టౌన్ హెచ్‌సీ ఎం.వెంకటేశ్వర్లు(సేవా పతకం ఉగాది), డీఎస్‌బీ హెచ్‌సి వి.తిరుమల ప్రసాద్(ఏపీ ఫార్మేషన్ డే సేవా పతకం), చీరాల 1 టౌన్ హెచ్‌సి జె.సుబ్బారావు (డీజీపీ కామాండేషన్), అడవులదీవి పీసీ సిహెచ్. వెంకట్రావు(ఏపీ ఫార్మేషన్ డే సేవా పతకం) అవార్డులు అందజేశారు. వీరితో పాటు జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 39 మంది పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బాపట్ల: స్వాతంత్య్ర వేడుకల్లో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాహసోపేతంగా నిర్వహించిన యోగా కార్యక్రమం సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. దేశం మనదేనంటూ జాతీయతను చాటిచెప్పేలా చీరాలలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు చేసిన నత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పోలీసుశాఖ దిశ యాప్‌పై అవగాహన కల్పించే విధంగా ప్రదర్శన నిర్వహించారు. చీరాలకు చెందిన విద్యార్థినులు స్వాతంత్య్ర ఘట్టాలను వివరిస్తూ కోలాటం ప్రదర్శించారు.

ఆకట్టుకున్న సంక్షేమ శకటాలు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చాటి చెప్పేలా శకటాల ప్రదర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ మైదానంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రజలను ఆకట్టుకున్నాయి. స్టాల్స్‌ను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, ఎమ్మెల్యే కోన రఘుపతి, జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఏఎస్పీ పి. మహేష్, బుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్మీలో ప్రాణాలను కోల్పోయిన కుటుంబ సభ్యులకు నివేశన స్థలాలు పంపిణీ చేశారు.


విన్యాసాలు చేస్తున్న కర్లపాలెం విద్యార్థులు


జాతీయ జెండా ప్రదర్శిస్తున్న చీరాల విద్యార్థులు


మత్స్యశాఖ రూపొందించిన శకటానికి అవార్డు


వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎడ్లబండిపై రైతులా ఉద్యోగులు


సైనిక కుటుంబాలకు నివేశన స్థలాలు అందిస్తున్న మంత్రి కొట్టు

తరగతి గదిలో భావి భారత నిర్మాణం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. రామకృష్ణప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: బావి భారత నిర్మాణం పాఠశాలల తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ అన్నారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ స్కూల్లో నిర్వహించిన మంగళవారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఆయన పాఠశాల వెలుపల ఉన్న ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు పాటిబండ్ల సీతారామయ్య కాంస్య విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజోపయోగ కార్యక్రమాలతో సామాజిక సేవా తత్పరునిగా తరించిన పాటిబండ్ల సీతారామయ్య చిరస్మరణీయులని, ఆయన్ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు శాస్త్రీయ నృత్య, దేశభక్తి గీతాలాపన, తైక్వాండో, యోగా, కర్రసాము ప్రదర్శన, మతాలన్నీ ఒకటే అని చాటి చెప్పేలా ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

దేశ సేవకు యువత సిద్ధం కావాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్


జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: దేశ సేవకు యువత సిద్ధం కావాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆకాంక్షించారు. 77వ స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్‌జిందాల్ జెండా ఎగురవేశారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలనలో బానిసత్వాన్ని చవిచూసిన భారత దేశం, ఎందరో స్వాతంత్య్ర సమరయోధుల త్యాగఫలితంగా 1947 ఆగస్టు 15న మనకు స్వాతంత్య్రం వచ్చిందన్నారు. ప్రస్తుతం మనం అనుభవిస్తున్న ఈ స్వేచ్ఛా, స్వాతంత్య్రం వారి త్యాగ ఫలితమేనని చెప్పారు. సమరయోధులను స్ఫూర్తిగా తీసుకొని యువత ఎల్లవేళలా దేశ సేవకు సంసిద్ధులై ఉండాలని కోరారు. అలాగే వారి త్యాగాలను వృథా కానివ్వకుండా మన దేశ ఉన్నతికి మన వంతు కృషి చేయాలన్నారు. త్యాగధనులు ఎలా అయితే మన దేశాన్ని గొప్పగా చూడాలని కలలు కన్నారో.. ఆ కలలను మనమందరం సాకారం చేయాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్ కుమార్, బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, ఎస్సీ,ఎస్టీ సెల్ డీఎస్పీ ఏవీ రమణ, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్‌ఐ బి.శ్రీకాంత్ నాయక్, అడ్మిన్ అర్ఐ ఎల్.మన్మథరావు పాల్గొన్నారు.

బాలికను మోసం చేసిన యువకుడి అరెస్టు

పెదకాకాని: బాలికకు మాయమాటలు చెప్పి మోసం చేసిన యువకుడ్ని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన తోకల ప్రసాద్ ఓ మైనర్‌తో ప్రేమ పేరుతో వెంట పడుతున్నాడు. గతంలో కూడా నడవడిక మార్చుకోవాలని బాలిక తల్లిదండ్రులు హెచ్చరించారు. అయినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈనెల 9న బాలిక కనిపించకపోవడంతో పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల 11న బాలిక తల్లి ఫిర్యాదు మేరకు ప్రసాద్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు అతడ్ని అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటిన కలెక్టర్ కుటుంబం


మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, కుటుంబ సభ్యులు

గుంటూరు వెస్ట్: 77వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, కుటుంబ సభ్యులు స్థానిక కలెక్టర్ బంగ్లాలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక మొక్కను నాటడమంటే ప్రకృతికి మనవంతు సాయం అందించడమేనని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు మొక్కలు నాటడంతోపాటు, వాటిని కాపాడడం ఎంత ముఖ్యమో చిన్నప్పటి నుంచే వివరించాలని సూచించారు. వీలైనంత వరకు ప్రతి ఇంటిలోనూ మొక్కలు నాటడం అలవర్చుకోవాలని కోరారు.

మహాత్మునికి జేసీ నివాళులు

స్థానిక కలెక్టరేట్‌లోని మహాత్మా గాంధీ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అలంకరించారు. స్వాతంత్య్ర పోరాటంలో మహాత్ముని పాత్ర ఎంత చెప్పినా తక్కువేనని కీర్తించారు.